
ప్రజాశక్తి

శుక్రవారం 31 మే 2024 5

పార్వతీపురం మన్యం




ఏజెన్సీలో భానుడి భగభగలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గత మూడు రోజులుగా గుమ్మ లక్ష్మీపురం ఏజెన్సీలో భానుడు భగభగలతో ప్రజలు అల్లాడుతున్నారు. మంగళవారం 44 డిగ్రీలు, బుధవారం 45 డిగ్రీలు, గురువారం 42 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. అత్యధిక స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట ప్రధాన రహదారి జనసంచారం లేక నిర్మానుష్యంగా బోసిపోయింది. ఎండ వేడిమి తట్టుకోలేక ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.





బలిజిపేటలో జెండాను ఆవిష్కరిస్తున్న సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి మన్మధరావు; సాలూరులో సిఐటియు ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న ఎన్‌వై నాయుడు, కార్మికులు

ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం

సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లాలో పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కూడళ్లలోను, సిఐటియు కార్యాలయాల వద్ద జెండాను ఎగురవేశారు.

బలిజిపేట : స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం దగ్గర సిఐటియు జెండాను జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1970లో బెంగాల్‌లోని కలకత్తా నగరంలో మే 30న సిఐటియు ఆవిర్భవించిందన్నారు. ఐక్యత, పోరాటం నినాదంతో 54 ఏళ్లుగా కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు సిఐటియు నిర్వహిస్తుందన్నారు. ఉద్యోగులు, స్కీం వర్కర్లు, ఆప్కాస్, కాంట్రాక్ట్, రెగ్యులర్ ఉద్యోగుల సమస్యలపై సిఐటియు పనిచేస్తుందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, ప్రభుత్వ సంస్థలను కాపాడాలని సిఐటియు పోరాడుతుందన్నారు. రాబోయే వచ్చే ప్రభుత్వాలు కార్మికుల సమస్యల పరిష్కార దిశగా ఆలోచించేలా ఉండాలని కోరారు. కార్యక్రమంలో రైస్ మిల్లు వర్కర్స్ అండ్ అమాలిస్ యూనియన్ అధ్యక్షులు పి.ఆప్పారావు. ఆటో యూనియన్ నాయకులు ఆనంద్, భార్గవ్, సుబ్బయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు



పాలకొండలో జెండాను ఆవిష్కరిస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు రమణారావు

పార్వతీపురం టౌన్ : పట్టణంలోని బెలగాంలో గల సుందరయ్య భవనం ఆవరణలో సిఐటియు జెండాను జిల్లా కోశాధికారి గొర్లె వెంకటరమణ అధ్యక్షతన మధ్యాహ్న భోజన నిర్వాహకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం పాత బస్టాండ్ వద్ద ఉన్న మున్సిపల్ కార్యాలయ ప్రాంతం వద్ద, టౌన్ రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఉన్న ఆటో కార్మికులతో కలిసి సిఐటియు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పాలకొండ : కార్మిక హక్కులను కాపాడడంలో సిఐటియు ముందు వరుసులో నిలుస్తుందని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు అన్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిఐటియు పాలకొండ మండల కమిటీ కార్యదర్శి కాదా రాము అధ్యక్షతన జరిగిన సభలో జెండా ఆవిష్కరణ చేపట్టారు. అనంతరం రమణారావు మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు, పోర్టులు, విమానాశ్రయాలు, బిఎస్ఎన్ఎల్ , అసంఘటిత, రంగం, సంఘటిత రంగంలో ఉన్న లక్షలా మంది ఉద్యోగులు, కార్మిక హక్కులు కాపాడడంలో సిఐటియు ముందు వరుసలో ఉంటుందని తెలిపారు. ఈ పదేళ్లలో కార్మిక హక్కులు పూర్తిగా కాలరాసి పెట్టుబడిదారులకు కార్మికుల శ్రమను కట్టబెట్టాలని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమలు చేసిందని తెలిపారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇలాంటి విధానాలపై పోరాటానికి కార్మికులంతా సిద్ధపడాలని, హక్కుల కోసం జరిగే పోరాటాల్లో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు జి.సత్యం, వై.శ్రీనివాసు, సిహెచ్ సంజీవి, పి.వేణు, సురేష్, బి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు సీనియర్ సభ్యులు తుపాకుల లక్ష్మణ్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఎన్వై నాయుడు మాట్లాడుతూ కార్మిక హక్కుల పరిరక్షణలో సిఐటియు ముందువరుసలో వుందని చెప్పారు. భవిష్యత్‌లోనూ కార్మికులు మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలని నాయుడు కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు శంకరరావు, వెంకట్రావు, ఇందు పాల్గొన్నారు.


సీతానగరం : సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కమిటీసభ్యులు ఆర్.రాము జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు వి.రామలక్ష్మి, ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు రెడ్డి లక్ష్మునాయుడు, భవన కార్మికుల సంఘం నాయకులు తోలాపు రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్, ఈశ్వరరావు, గ్రీన్ అంబాసిడర్ నాయకులు జలుమూరు గౌరు తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కొమరాడలో సిఐటియు జెండాను జిల్లాకమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి ఎగురవేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఉపేంద్ర, శివున్నాయుడు, భవన కార్మిక సంఘం నాయకులు మన్మధరావు, ఈశ్వరరావు, పోలినాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అప్పలనాయుడు, శివున్నాయుడు, తిరుపతిరావు, బాల, వెంకట్రావు, ఆటో కార్మికులు లక్ష్మణరావు, గౌరినాయుడు పాల్గొన్నారు.

పాచిపెంట : మండల కేంద్రంలో కార్మిక సంఘాల జ్యూట్ మిల్ నాయకులు జర్జాపు వెంకటరమణ, ఆటో కార్మిక సంఘం నాయకులు కొర్ర సింహాద్రి సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు శ్రీనివాసరావు, ఐద్వా నాయకులు ఇందిరాదేవి, కె.లక్ష్మి, కాళ సత్య సన్యాసమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురంలోని పాతబస్టాండ్ వద్ద జరిగిన సభలో మాట్లాడుతున్న వెంకటరమణ



సీతానగరంలో సిఐటియు జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు రాము

ఎవరెలా స్పందించారో?

- అభ్యర్థుల గుండెల్లో దడ
- ఫలితాల వెల్లడికి మరో నాలుగు రోజులే

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



ఇప్పటికే ఎన్నోసార్లు కూడికలు, తీసివేతలతో గెలుపోటములపై లెక్కించుకున్న ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో ఇంకా పలు సందేహాలు, అనుమానాలు తలెత్తుతున్నాయి. మరోవైపు ఫలితాల వెల్లడికి మరో నాలుగు రోజులే సమయం ఉండడంతో అందరి అభ్యర్థుల్లోనూ ఉత్కంఠ కనిపిస్తోంది. కరుడుగట్టిన కార్యకర్తలైతే నరాలు తెగే ఉత్కంఠతో ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో కేవలం కుల సమీకరణాలు, బంధుత్వాలు, వివిధ పార్టీలకు ఉన్న అనుకూల, ప్రతికూల అంశాలతోపాటు మరిన్ని కోణాల్లో ఆసక్తికరమైన చర్చనడుస్తోంది. గడిచిన పదేళ్లలో ఒక దఫా టిడిపి, మరో దఫా వైసిపి అధికార, ప్రతిపక్ష పాత్రలు పోషించాయి. ఈనేపథ్యంలో ఇరు ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమం, విధ్వంసాలు, ప్రతీకార చర్యలపై జిల్లాలో లోతైన చర్చనడుస్తోంది. అభివృద్ధి విషయానికి వస్తే వైసిపి హయాంలో జిల్లాకు మెడికల్ కాలేజీ, గ్రామ సచివాలయాలు, నాడు - నేడు భవనాలు మినహా ఆ స్థాయిలో చెప్పుకోదగ్గ వేమీ లేదనే చర్చనడుస్తోంది. ఇందులోనూ ఈ భవన నిర్మాణాల బకాయిలు రూ.కోట్లలోనే ఉన్నాయి. బిల్లులు సకాలంలో చెల్లించక పోవడంతో చాలా మంది సర్పంచులు ఏళ్ల తరబడి అప్పుల్లో ఉన్నారు. ఇది వైసిపికి ప్రతికూల అంశంగా ఉటుందని పలువురు భేరీజు వేస్తున్నారు. ఎయిర్‌పోర్టు, గిరిజన వర్శిటీల గుర్తించి వైసిపి ప్రచారం ఎన్నికల్లో బాగానే ప్రచారం చేసినప్పటికీ, వాటివల్ల ఓట్లు కురిసే అవకాశం లేదని ఒక విశ్లేషణ. గిరిజన వర్శిటీ కొత్తవలస ప్రాంతం నుంచి మెంటాడ మండలానికి మార్పుచేసి శంకుస్థాపన చేయడం మినహా పనులు ఇంకా ప్రారంభించలేదు. వీటిపై ఆశ నిరాశల మధ్య ఉన్న జనం ఓటింగ్ సమయానికి అధికార పార్టీకి వ్యతిరేకంగా మారిపోయారన్న అంచనాలు చాలామంది నోట వినిపిస్తున్నాయి. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని పరిశీలిస్తే తోటపల్లి, రామతీర్థసాగర్ ప్రాజెక్టులకు కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎక్కువ నిధులు ఖర్చు చేశాయి. గడిచిన పదేళ్లలో పరిశీలిస్తే వైసిపి కన్నా టిడిపియే ఎక్కువ నిధులు కేటాయించాయి. ఇది వైసిపి ప్రతికూల అంశమేనన్న అంచనాలు వినిపిస్తున్నాయి. రైతు భరోసా మినహా రైతులను కరువు కాటకాల్లో ఆదుకోవడంలో గానీ, ఇన్‌పుట్ సబ్సిడీ పెంపులోగానీ వైసిపి ఉదారంగా వ్యవహరించలేదన్న అసంతృప్తి రైతుల్లో ఉంది. గత మూడేళ్లల్లో జిల్లాలోని భీమిసింగి సుగర్ ఫ్యాక్టరీని ఆధునీకరణ పేరుతో మూసి వేయగా, అప్పుల పేరుతో లచ్చయ్యపేట సుగర్స్‌ను ఎత్తివేశారు. దీంతో, చెరకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. సుమారు 90కిలోమీటర్ల దూరంలోవున్న సంకిలి ఫ్యాక్టరీకి తీసుకెళ్లడం రైతులకు భారంగా మారింది. ఇవన్నీ రైతాంగంలో వైసిపి పట్ల వ్యతిరేకత చూపి ఉండవచ్చని విశ్లేషణలు ఉన్నాయి. ఈ విషయంలో చంద్రబాబు కూడా రైతులను పెద్దగా ఆదుకునేది లేదనే వాదన కూడా ఉంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్ల జిల్లాలోని ఉద్యోగులు, నిరుద్యోగులు, యువత వైసిపికి వ్యతిరేకంగా పనిచేశారనే వాదన బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు వైసిపి పాలన, విధానాల పట్ల తొలి నుంచీ గుర్రుగానే ఉన్నారు. జిల్లాలో వలసకూలీలు చాలా ఎక్కువ. పాలకుల వల్లే పిల్లలు, తల్లిదండ్రులను వదిలేసి సుదూర ప్రాంతాలకు వలసపోవాల్సి వచ్చిందనే భావన వ్యక్తమైంది. ఈనేపథ్యంలో వలస కూలీల్లో ఎక్కువ మంది సాధారణంగానే పార్టీతో సంబంధం లేకుండా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లు వేసే అవకాశాలే జిల్లాలో ఎక్కువగా ఉంటాయి. ఇవన్నీ టిడిపికి కలిసి వచ్చే అంశాలుగా ఉన్నాయి. అయితే, వైసిపికి కలిసొచ్చే అంశాలు లేకపోలేదు. సంక్షేమ పథకాలు ఎక్కువ మంది జనాన్ని ఆకర్షించాయనడంలో సందేహం లేదు. ఈసారి వృద్ధులు, వికలాంగులతోపాటు సామాజిక పింఛన్లు అందుకుంటున్నవారిలో వైసిపికి అనుగుణంగానే ఎక్కువ మంది ఉన్నారనడం లో సందేహం లేదు. ఆరోగ్య శ్రీ పథకం కింద లబ్ధిపొందిన టిడిపి కుటుంబాల వారు కూడా వైసిపి పట్ల సానుకూలంగా మారిపోయారు. ముఖ్యంగా ఆసరా పథకం ద్వారా డ్వాక్రా రుణాల మాఫీ, చేయూత, అమ్మఒడి తదితర పథకాలు మహిళలను చాలా వరకు ఆకర్షించాయి. ఈ నేపథ్యంలోనే మహిళా ఓట్లు తమకు ఎక్కువగా వస్తాయన్న ఆశాభావం వైసిపి నాయకులు వ్యక్తం చేస్తున్నారు. కానీ, మహిళల్లో ఉద్యోగులు, నిరుద్యోగులు మాత్రం వైసిపికి వ్యతిరేకంగానే ఉన్నారన్నది మరో విశ్లేషణ ఉంది. విద్యాదీవెన, విద్యాకానుక, జగనన్న ఇళ్లు తదితర పథకాలు వైసిపికి బాగా కలిసొచ్చే అంశాలు. ఈనేపథ్యంలో ప్రస్తుత ఎన్నికల్లో కుల, మత రాజకీయాలు పెద్దగా పనిచేయకపోవచ్చు. ఓట్ల కోసం ఇరు పార్టీలకు చెందిన అభ్యర్థులూ పోటాపోటీగా డబ్బులు పంచడం వల్ల ఈ ప్రభావం కూడా పెద్దగా కనిపించకపోవచ్చనే అంచనాలు వినిపిస్తున్నాయి. సంక్షేమ పథకాలు వైసిపికి ఎంతో మేలు చేకూర్చే అవకాశం ఉన్నప్పటికీ, పోలింగ్‌కు పది రోజుల ముందు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రయోగించిన 'ల్యాండ్ టైటిలింగ్ యాక్టు' బాగా జనాల్లోకి వెళ్లింది. జిల్లాలో మెజార్టీ ప్రజలకు ఎంతో కొంత భూమి, ఇంటి స్థలాలు, ఇళ్లు ఉన్నాయి. వైసిపి అమలు చేస్తున్న ఈ యాక్టు వల్ల ఈ స్థిరాస్తులు కోల్పోతామనే అభద్రతా భావం ఎక్కువ జనాల నోట వినిపిస్తోంది. ఈ ప్రచార అస్త్రం టిడిపి అభిమానులు, సంక్షేమ పథకాల వల్ల సంతృప్తి చెందినవారిని సైతం కలవరానికి గురిచేసిం దని, అదే జరిగితే ఆ మేరకు టిడిపి లాభపడే అవకాశం లేకపోలేదని జనం చర్చించుకుంటు న్నారు. జనం ఏ అంశానికి ఎంతెంత ప్రాధాన్యతనిచ్చి, ఓట్ల రూపంలో తీర్పు నిచ్చారనేది ఈనెల 4వ తేదీ వరకు వేచిచూడాల్సివేంది. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థుల అందరినోటా గెలుపు ధీమా వినిపిస్తోంది.

హైనా హల్‌చల్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధిలోని కొండపేట సమీపంలో కొండను ఆనుకొని ఉన్న తోటల్లో గురువారం హైనా (దుమ్మలగుండు) హల్‌చల్ చేసింది. కొండపైనుంచి దిగిన హైనా కాలనీలోకి చొరబడడం తో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు.

తగాదాలకు పాల్పడితే చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి-పాలకొండ



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి కృష్ణారావు

పాలకొండ, కురుపాం నియోజకవర్గాలలో ఓట్ల లెక్కింపు రోజున ఫలితాలను బట్టి ఆయా పార్టీ నాయకులు గోరంతను కొండంతలు చేస్తే చర్యలు తప్పవని డిఎస్‌పి జివి కృష్ణారావు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏ పార్టీ వారైనా కవ్వింపు చర్యలకు పాల్పడినా, ప్రత్యర్థులను రెచ్చగొట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ర్యాలీలు, ఊరేగింపులు, బాణసంచా పేల్చడం వంటి వాటిని పూర్తిగా నిషేధించామని, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు సహకరించాలని కోరారు. నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ పికెటింగ్, క్విక్ రెస్పాన్స్ టీమ్స్, ప్రత్యేక సాయుధ బలగాలు, జిల్లా స్పెషల్ పార్టీస్ దళాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రతి రాజకీయ పార్టీ కార్యాలయాలు, ఇళ్ల వద్ద, వాహనాల పార్కింగ్ ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఓట్లు లెక్కింపు సమయంలో పార్టీల నాయకులు సమయపాలన పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు. జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు సమయంలో ఎటువంటి గొడవలకు తావు లేకుండా 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. ఓట్ల లెక్కింపు రోజున ప్రజలెవరూ రోడ్లపై రావడం గానీ, గుంపులు గుంపులుగా ఉండడం గానీ చేయరాదని హెచ్చరించారు. ఎన్నికల్లో గెలుపు పొందిన పార్టీ నాయకులు ఇతర పార్టీ వారిని చులకనగా, హేళనగా మాట్లాడ కూడదన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపైనా, రౌడీ షీటర్లపైన ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. అల్లర్లకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, అన్ని గ్రామాల్లోనూ కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిఐ చంద్రమౌళి, ఎస్‌ఐ ప్రశాంత్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఆర్‌టిసి కార్మిక సంఘ నాయకుల అక్రమ సస్పెన్షన్లు ఎత్తేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో కార్మిక ,ఉద్యోగ, సంఘాల నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆర్టీసి కార్మిక సంఘం నాయకుల అక్రమ అరెస్టులు ఎత్తివేయాలని రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ పేరుతో ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ సుందర్రావు, బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిర్రా శాంసన్, ఎన్ఎంయు తణుకు డిపో కార్యదర్శి సుబ్బారావుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 మందిని ఆర్టీసీ యాజమాన్యం అక్రమంగా సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తూ సి ఐటియు, ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ విజయనగరం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో గురువారం ఎన్‌పిఆర్ భవన్ రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ జిల్లా కన్వీనర్ ఎ.జగన్మోహన్‌రావు కార్మిక నాయకులపై అక్రమ సస్పెన్షన్లను తక్షణమే ఎత్తివేయాలని పెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. సి ఐ టి యు జిల్లా ఉపాధ్యక్షులు టివి రమణ , నగర కార్యదర్శి బి .రమణ, ఎపిఎంఎస్‌ఆర్‌యు రాష్ట్ర కార్యదర్శి యుఎస్ రవికుమార్, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.రాములు, డిపో కార్యదర్శి చంద్రయ్య, ఆర్టీసి, ఎస్‌సి, బిసి నాయకులు జి. ప్రసాదరావు, టివికెఎస్ నారాయణ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కె.త్రినాధ్ మాట్లాడారు. కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై సమావేశం జరుపుకుంటే అది కోడ్ ఆఫ్ కాంటాక్ట్ కిందకు ఎలా వస్తుందని ప్రశ్నించారు. ఎలాంటి విచారణ లేకుండా సస్పెన్షన్లు చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. బేషరతుగా సస్పెన్షన్ ఎత్తివేయాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు చేసే పోరాటానికి కార్మిక ఉద్యోగ ఉపాధ్యాయ విద్యార్థి, మహిళా సంఘాల సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. పాలకులు , అధికారులు భావ ప్రకటన స్వేచ్ఛపై దాడి చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల రక్షణ కోసం నిలబడుతున్న సుందరయ్య లాంటి వారిని సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. సమావేశంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ డిపో అధ్యక్షులు సిహెచ్ వి రావు, మహిళా కన్వీనర్ బి. లక్ష్మి, వివిధ సంఘాల నాయకులు నవీన్ కుమార్ హరీష్ ,సుమంత్ కుమార్, రఫీ, డిఎస్ రావు, కెఆర్ కుమార్, సిహెచ్ రాజేశ్వరి సావిత్రి రాములమ్మ, ఎస్‌బి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

లార్వా నిరోధక రసాయనాలు పిచికారీ

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

పట్టణంలో నిర్వహిస్తున్న పారిశుధ్య స్పెషల్ డ్రైవ్‌ను జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్ మోహనరావు, మున్సిపల్ కమిషనర్ కె. శ్రీనివాసరావు పర్యవేక్షణ చేశారు. గురువారం జగన్నాధపురం గల 29,30 వార్డుల్లో చేపట్టిన కాలువల్లో పూడిక తీత, దోమల లార్వా నివారణ పిచికారీలను వారు పరిశీలించారు. దోమల లార్వా వృద్ధి చెందకుండా, దోమలు వ్యాప్తిని అరికట్టేందుకు లార్వా నిరోధక రసాయనాలను పిచికారి చేయిస్తున్నట్టు తెలిపారు. నీరు నిల్వ లేకకుండా కాలువల్లో పూడికలు తీయిస్తున్నామన్నారు. తద్వారా దోమలు ప్రబలకుండా సీజనల్ జ్వరాలు అదుపులో ఉండేందుకు నియంత్రణ చర్యలు చేపడుతున్నామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. జిల్లాలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ ను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా చేపట్టడం జరిగిందని ఆయన చెప్పారు. దోమలపై దండ యాత్ర చేసి వ్యాప్తి నివారణ చేస్తామని, మలేరియా, డెంగీ వంటి వ్యాధులకు అవకాశం లేకుండా అన్ని చర్యలు చేపట్టడం జరిగిందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎఎంఒ సూర్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



కురుపాంలో మురుగు కాలువల్లో క్లోరినేషన్ చేయిస్తున్న వైద్య సిబ్బంది

కురుపాం : మేజర్ పంచాయతీ కురుపాం లో శుక్రవారం ఫ్రైడే, డ్రై డే కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శులు కె.చంద్రశేఖర్, బి.అనిత నిర్వహించారు. ఈ సందర్భంగా దోనక వీధి, శివ్వల వీధి, శివన్నపేట, ప్యాలస్ రోడ్డు తదితర వీధుల్లో గల తాగునీటి ట్యాంకర్లు శుభ్రపరచి క్లోరినేషన్ చేశారు. అలాగే మురుగు కాలువలు, పరిసర వీధులు శుభ్రపరిచి క్లోరినేషన్ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలో అన్ని వీధుల్లోనూ, తాగునీటి ట్యాంకులు, మురుగ కాలువలు పరిశుభ్రపరిచి క్లోరినేషన్ చేస్తున్నట్టు తెలిపారు. ప్రజలెవరూ వ్యాధుల బారిన పడకుండా అందరూ ఆరోగ్యంగా ఉండేలా ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరు: మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణపై అధికారులు గురువారం ప్రత్యేక దృష్టి సారించారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ శివకుమార్ పర్యవేక్షణలో ఇంఛార్జి మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్మూర్తి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఫకీర్ రాజు దగ్గరుండి పారిశుధ్య నిర్వహణ పనులు చేయించారు. పట్టణంలో వివిధ వార్డుల్లో కాలువల్లో పూడికతీత పనులు నిర్వహించారు. దోమల లార్వా వృద్ధి చెందకుండా రసాయనాల పిచికారీ చేశారు. ఇళ్లల్లో నీరు ఎక్కువ రోజులు నిల్వ చేయొద్దని సూచించారు.

గరుగుబిల్లి: స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్ మండలంలో సాంబన్నవలసలో జరుగుతున్న పారిశుధ్య డ్రైవ్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన సచివాలయం పరిధిలో గల గ్రామాల్లో నీటి నిల్వలు, బురద గుంటల గుర్తించి సంబంధిత సెక్రటరీ, గ్రీన్ అంబాసిడర్లను అప్రమత్తం చేసి వాటి పూడికలను తీయించామని ఆదేశించారు. ఆశా వర్కర్లు ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరాలను గుర్తించి కిట్లతో పరీక్షలు నిర్వహించాలని, హెల్త్ అసిస్టెంట్లు స్లైడ్స్ తీసి ల్యాబ్ టెక్నీషియన్ ద్వారా పరీక్షలు నిర్వహించాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో ఎఎన్ఎం సుమతి, ఎంఎల్‌హెచ్.పి శిరీష, 104 సిబ్బంది దుర్గాప్రసాద్, శంకర్రావు, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.



పార్వతీపురం పట్టణంలోని కాలువల్లో దోమలమందు పిచికారీని పరిశీలిస్తున్న డిఎంఒ

భామిని : గ్రామాల్లో ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, నీటి నిల్వలు లేకుండా చూడాలని, దోమతెరలు వాడాలని బత్తిలి పిహెచ్‌సి వైద్యులు కొండ్రి దామోదరరావు తెలిపారు. బత్తిలి పిహెచ్‌సి పరిధిలోని మనుమకొండ, కాట్రగాఢ, బత్తిలిలో దోమ లార్వాలు నివారణకు కాలువలు, బోరుబావులు, ఇళ్ల పరిసరాల్లో దోమ మందు పిచికారీ చేశారు. దోమలు నివారణపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో మనుమకొండ సర్పంచ్ నిమ్మల కేశవ, బత్తిలి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రెసీ సెంటర్లను సందర్శించిన జెడి

ప్రజాశక్తి- పాచిపెంట

పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనలో భాగంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎ.విజయ మండలంలో గల పలు క్రెసి సెంటర్లను గురువారం సందర్శించారు. నీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పనుకువలస, నీలంవలస, భీమన్న దొర వలస, క్రెసి సెంటర్లను సందర్శించి సెంటర్ల నిర్వహణ గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహారం సక్రమంగా అందుతుందా లేదా అని బాలింతలు, చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎన్ రాణి, సిడిపిఒ బి అనంతలక్ష్మి, నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి వేణుగోపాలరావు, అంగన్వాడి సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ సిబ్బందికి సూచనలు ఇస్తున్న జెడి విజయ

ఆన్‌లైన్ మూల్యాంకనంపై శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష జవాబు పత్రాల ఆన్‌లైన్ మూల్యాంకనంపై శిక్షణా కార్యక్రమం గురువారం జరిగింది. ఈ నెల 24నుంచి 31 వరకు పరీక్షలు జరుగుతున్నాయి. జూన్ 1నుంచి ఆన్‌లైన్‌లో మూల్యాంకనం జరుగుతుంది. మూల్యాంకనంపై ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిక్షణా కార్యక్రమంలో జిల్లా వృత్తి విద్యాధికారి డి.మంజుల వీణ పాల్గొన్నారు. ఆన్‌లైన్ మూల్యాంకన శిక్షణలో జిల్లాలోని ప్రభుత్వ, ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, మోడల్ కాలేజ్, కేజీబీవీ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు చెందిన 275 మంది సిబ్బంది పాల్గొన్నారు. ఆన్లైన్ మూల్యాంకనంపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని ఆమె అన్నారు. ఎక్కడా పొరపాట్లకు తావులేకుండా మూల్యాంకనం చేయాలని ఆమె ఆదేశించారు.


మాట్లాడుతున్న డి.మంజుల

వీధికుక్కల సంచారంతో భయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట గ్రామాల్లో ప్రధాన రహదారులపై కుక్కల సంచారం ఎక్కువగా ఉంది. కుక్కలు వల్ల ప్రజలు వీధుల్లోకి రావాలంటేనే భయపడుతున్నారు. గుంపులు గుంపులుగా కుక్కలు తిరగడంతో ఎటు నుంచి వచ్చి ఏ కుక్క కాటు వేస్తుందో తెలియని పరిస్థితి. ఇటీవల కాలంలో మన్యం జిల్లాలో కుక్కకాటు బాధితులు ఎక్కువయ్యారు. కుక్కల దాడిలో మృత్యువాత పడినవారు కూడా ఉన్నారు. ఏజెన్సీలో ఇటువంటి సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

భద్రగిరి ఎస్ఎన్‌సియు సందర్శన

ప్రజాశక్తి- గుమ్మలక్ష్మీపురం

మండలంంలోని భద్రగిరి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఉన్న ఎస్ఎన్‌సియును మన్యం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి మూటక నారాయణ గురువారం ఆకస్మికంగా సందర్శిం చారు. ఎస్ఎన్‌సియు లోని పసిపాపల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందికి తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్త్ సెంటర్లను, పిహెచ్‌సిలు తదితర ఆసుపత్రులను సందర్శిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇమ్యూనైజేషన్ కార్యక్రమాలకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు.


వివరాలను ఆరా తీస్తున్న నారాయణ



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ఎంపిడిఒ, అధ్యాపకులు

ఉద్యోగాలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక పాలిటెక్నికల్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు పలు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉద్యోగ అవకాశాలు పొందిన విద్యార్థులకు ఎంపిడిఒ జగదీశ్వరరావు చేతులు మీదుగా గురువారం నియామక పత్రాలు అందజేశారు. వచ్చిన ఉద్యోగ అవకాశాలు సద్వినియోగం చేసుకుని భవిష్యత్తును చక్కదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జగదీశ్వరరావు, ఐటిఐ ప్రిన్సిపల్ సునీల్ కుమార్, సిబ్బంది ఉన్నారు.


ధ్రువ పత్రాలను పరిశీలిస్తున్న సిబ్బంది

కొనసాగుతున్న ధ్రువపత్రాల పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పాలిటెక్నిక్ కళాశాలల ప్రవేశాలకు మండలంలోని ఎంఆర్‌నగరం ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో జరుగుతున్న ధ్రువపత్రాల పరిశీలన గురువారం కొనసాగింది. ఈ పరిశీలనలో 38 మంది అభ్యర్థుల హాజరై తమ పత్రాలను పరిశీలనకు అందజేశారు. వీరిలో ఓసి 6, బీసీ 30, ఎస్సీ 2 ఉన్నట్లు ప్రిన్సిపల్ విలియం కేరి తెలిపారు.

'ఇండియా' అధికారంలోకి రావడం ఖాయం

ప్రజాశక్తి-బొబ్బిలి

ఇండియా కూటమి అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని పిసిసి అధికార ప్రతినిధి ముర్వల శ్రీనివాసరావు అన్నారు. కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బిజెపి పదేళ్ల పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. బ్యాంకింగ్, బీమా, రైల్వే, ఎయిర్ లైన్స్, లాభాల బాటలో నడిచే పరిశ్రమలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించారని విమర్శించారు. బిజెపి విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఓట్లు వేసి ఇండియా కూటమికి మద్దతు ఇచ్చారని చెప్పారు.

మధుపాడలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలోని మధుపాడ గ్రామంలో గురువారం సిఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ప్రతి ఇంటినీ జల్లెడ పట్టారు. ప్రతి ఒక్కరినీ నేరుగా వారి కుటుంబ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల వాహనదారులను వారి అనుమతి పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ ఉన్న సందర్భంగా ఎన్నికల కౌంటింగ్ దగ్గర పడుతున్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. గ్రామాల్లోకి అపరిచిత వ్యక్తులు ఎవరైనా వచ్చినట్లయితే వెంటనే తమకు సమాచారం అందించాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

1న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని నారాయణి హృదయ ఆస్పత్రిలో శనివారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యులు పెంట సునీల్ కుమార్, బి.లావణ్య చెప్పారు. ఆస్పత్రిలో బిపి, మధుమేహం, హెచ్‌బిఎ 1సి, లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలు ఉచితంగా చేస్తామని చెప్పారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బిసిజి టీకా తప్పనిసరి

ప్రజాశక్తి-వేపాడ

బిసిజి టీకా తప్పనిసరిగా వేసుకోవాలని వేపాడ పిహెచ్‌సి వైద్యులు ఎ.ధరణి తెలిపారు. పిహెచ్‌సి పరిధిలోని గ్రామాల్లో గురువారం బిసిజి టీకాలు వేశారు. ఈ టీకా వల్ల కలిగే ప్రయోజనాలను ఆమె వివరించారు.

పర్యాటక హబ్‌గా సీతంపేట ఏజెన్సీ

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేట ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్క్ గత పిఒ శివ శంకర్ 2017లో సుమారు మూడు కోట్లు వ్యయంతో నిర్మించారు. ఈ పార్కులో ఇప్పటికే సుమారు 55 మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించాయి. దీంతో పాటు మెట్టుగూడ జలపాతం పగోడాలు పనులు పూర్తి చేసి ప్రారంభించారు. అప్పట్లోనే జగత్ పల్లి రిసార్ట్స్ ఆడలి వ్యూ పాయింట్ పిఎంఆర్సి వద్ద గిరిజన మ్యూజియం శంకుస్థాపన చేసి పనులు కూడా ప్రారంభించారు. సీతంపేట ఏజెన్సీలో అడ్వెంచర్ పార్క్ నిర్మించిన తర్వాత రూపురేఖలు మారాయి. ఒకప్పుడు సీతంపేట అంటే పెద్దగా తెలిసేది కాదు. అడ్వెంచర్ పార్క్ ఏర్పాటు చేసిన తర్వాత. సీతంపేట మన రాష్ట్రమే కాకుండా ఇతర రాష్ట్రాలకు కూడా తెలిసింది. పార్కులో ఫైవ్ డి థియేటర్, హ్యాంగింగ్ బ్రిడ్జ్, ప్యారా మోటర్ బోటు షికారు, జెయింట్ వీల్, ఆల్ ట్రైన్ వెహికల్ మినీ ట్రైన్, చిన్నారుల బోటింగ్, కమాండోనేట్ క్లైమింగ్ వాల


మ్యూజియంలో బుట్టల నమూనాలు

పెరగనున్న ఉపాధి అవకాశాలు, వ్యాపారాలు

చిన్నప్పుడు గుర్తుకొచ్చే బొమ్మలు, యువతులు, యువకులు ఉత్సాహంగా ఉల్లాసంగా డ్యాన్స్ వేసే ఆనంద విహార్ ఇలాంటివన్నీ ఒక ప్రత్యేకంగా కనిపిస్తాయి. కాసేపు పార్కులో సేద తీర్చుకోవడానికి బాగుంటుంది. ఇక మెట్టుగూడ జలపాతం వద్ద అందమైన పగోడాలు నిర్మించారు. కొండలపై నుంచి ఒంపలు సొంపులుగా నీరు ప్రవహించి జలజల జారుతుంటే ఆపైన పర్యాటకులు జలకలాడుతుంటే ఉత్సాహం ఉల్లాసం వేరేగా చెప్పనవసరం లేదు. ఇప్పటికే జగత్ పల్లి రిసార్ట్ పనులు నిలిచిపోయాయి. ఆడలి వ్యూ పాయింట్ పనులు రూ.45 లక్షలు కేటాయించారు. 90 శాతం పనులు పూర్తయ్యాయి. అక్కడ పర్యాటకులు పర్యాటక ప్రాంతాలు కనువిందు చేసుకోవడంతో పాటు రాత్రి బసచేసేటట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. సీతంపేట పిఎంఆర్సిలో కోటి రూపాయలతో గిరిజన మ్యూజియం నిర్మాణాన్ని సుమారు 90శాతం పూర్తి చేశారు. ఈ మ్యూజియంలో అన్ని దేశ, రాష్ట్రాల గిరిజనుల సాంప్రదాయం సంస్కృతి ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రూ.40 లక్షలతో షాపింగ్ మాల్ పూర్తి చేశారు.దీంతో పాటు జగత్ పల్లి రిసార్ట్స్ ఆడలి వ్యూ పాయింట్ పనులు పూర్తయితే గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. దీనికి తోడు సీతంపేటలో వ్యాపార సముదాయాలు పెరుగుతాయి. పర్యాటకులు పెరిగితే హోటల్స్, కిరాణా షాపులు చిన్న చిన్న దుకాణాలు పెరిగి వ్యాపారాలు వృద్ధి చెందుతాయి. దీంతో యువతకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా వచ్చి ఆర్థికంగా స్థిరపడే అవకాశాలున్నాయి. అయితే వీటితో పాటు తురాయిపు వలస హెచ్ఎన్టి ఫారం వద్ద ఎకో పార్క్, సున్నపు గడ్డ వద్ద కర్రతో హ్యాంగింగ్ బ్రిడ్జ్ పోల్ల యు పాయింట్ నిర్మించడానికి ప్రణాళికలు రూపొందించారు. ఇవి కూడా ఏర్పాటు చేస్తే మరింత ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు.

పర్యాటక పనులు శరవేగంగా పూర్తి చేస్తున్నాం


ఆడలి వ్యూ పాయింట్ ఇదే..

పర్యాటక పనులు సీతంపేట ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ శాఖకి అప్పజెప్పాం. రూ. 45 లక్షలతో ఆడలి యు పాయింట్ పనులు 95 శాతం పూర్తి చేసాం. పర్యాటకులు రాత్రి బస చేసేటట్లు సౌకర్యాలు కల్పిస్తున్నాం. పిఎంఆర్‌సి వద్ద గిరిజన మ్యూజియం షాపులు 40 లక్షలతో నిర్మించాం.

ఎస్ సింహాచలం ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సీతంపేట ఐటిడిఎ.

ఆకర్షణీయంగా పర్యాటక పనులు

పర్యాటకులకు ఆకర్షణీయంగా అన్ని సౌకర్యాలు ఉండేటట్లు మ్యూజియం, ఆడాలి యు పాయింట్ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే 90 శాతం వరకు పూర్తి చేసాం. జగత్ పల్లి రిసార్ట్స్ పనులు త్వరలోనే టెండర్లకు పిలుస్తాం.

నారాయణ రావు, జిల్లా పర్యాటక శాఖాధికారి

ఉపాధి కూలీల ప్రాణాలతో చెలగాటమా?

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఈశ్వరరావు

ప్రజాశక్తి - బలిజిపేట

ఉపాధి పనుల వద్ద మౌళిక సదుపాయాలు కొరత స్పష్టంగా కనిపించినా అధికారులు నిర్లక్ష్యంగా ఉంటూ వేతనదారుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు అన్నారు. మండలంలోని బలిజిపేట, వెంగాపురంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం కూలీలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 డిగ్రీల మండుటెండలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలకు మజ్జిగ, మంచినీళ్లు, ప్రథమ చికిత్స పరికరాలేవీ లేవన్నారు.ఉపాధి చట్టం గ్రామీణ ప్రాంత పేదలకు, పేద మధ్యతరగతి రైతులకు ఎంతో ఉపయోగపడిందన్నారు. ఇటువంటి చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయన్నారు. అందులో భాగంగానే ఎన్ఎంఎంఎస్ యాప్ తెచ్చి ఎప్పుడు లేని విధంగా రెండు పూటలా పని పెట్టి ఉపాధి కూలీలను ఎండల్లో ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఉపాధి పనుల వద్ద కనీసం మౌలిక సదుపాయాలు కల్పించడంలేదన్నారు. గతంలో టెంట్లు, మజ్జిగ, ప్రథమ చికిత్స పరికరాలు, మంచినీరు ఇచ్చే వారని, గడ్డపారకు, తట్టకు కూడా డబ్బులు వచ్చేవి, వేసవి అలవెన్స్ మార్చిలో 20 శాతం, ఏప్రిల్, మే, జూన్‌లో 30 నుండి 50శాతం ఇచ్చేవారని తెలిపారు. ఇప్పుడు అవేమీ లేవన్నారు. మధ్యాహ్నం పూట కూడా పనులు పెట్టడంతో వ్యవసాయ పనులు చేసుకోవడానికి అవకాశం ఉండడంలేదని, దీంతో వేతనదారులు తీవ్ర నిరాశ చెందుతున్నారని అన్నారు. కావున ఇప్పటికైనా ప్రభుత్వం ఒక్క పూట పని, ఉపాధి పనులు దగ్గర కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని, వ్యవసాయ పనుల్లో యాంత్రీకరణ పెరుగుతున్న నేపథ్యంలో పెరుగుతున్న ధరలకు అనుకూలంగా ఉపాధి పనులు 200 రోజులు, రోజు వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సిఐటియు నాయకులు వై.మన్మధరావు, సురేష్, లక్ష్మణ, శ్రీను సిఐటియు నాయకులు యమ్మల మన్మధరావు తదితరులు ఉన్నారు.


కూలీలతో మాట్లాడుతున్న ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఈశ్వరరావు


తోటలో ఉన్న హైనా

హైనా హల్‌చల్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధిలోని కొండపేట సమీపంలో కొండను ఆనుకొని ఉన్న తోటల్లో గురువారం హైనా (దుమ్మలగుండు) హల్‌చల్ చేసింది. కొండపైనుంచి దిగిన హైనా కాలనీలోకి చొరబడడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అంతలోనే అప్రమత్తమై తాళ్లతో బంధించారు. అనంతరం అటవీశాఖ అధికారులకు సమాచారం అందించి అప్పగించారు. ఇటీవల రామతీర్థం, బొప్పడాం, గొర్లెపేటలో కూడా హైనా హల్‌చల్ చేసింది.

జ్వరాల నిర్ధారణ పరీక్షలపై ఆరా

ప్రజాశక్తి- సీతంపేట

ప్రాంతీయ ఆసుపత్రిని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్ మోహనరావు గురువారం సందర్శించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి శ్రీనివాసరావుతో సమీక్షించి ఆసుపత్రిలో జ్వరాలతో చేరిన వారు, వారిలో మలేరియాగా గుర్తించిన కేసులు, వారికి అందజేస్తున్న చికిత్స మొదలగు వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌ను తనిఖీ చేసి ప్రతీ రోజూ నిర్వహిస్తున్న జ్వర నిర్ధారణ పరీక్షలు, వాటి నివేదికలు తదితర వివరాలపై ఆరా తీసి రికార్డులను పరిశీలించారు. ఎప్పటి నివేదికలను అప్పుడే నమోదు చేసి మలేరియాగా నిర్ధారణ అయిన కేసుల వివరాలను జిల్లా మలేరియా అధికారి వారి కార్యాలయానికి తెలియజేయాలని ఆదేశించారు. మలేరియా నిర్ధారణ సూక్ష్మ దర్శిని ద్వారా జరపడానికి ఎక్కువ ప్రాముఖ్యతనివ్వాలన్నారు. అనంతరం వార్డులను సూపరిండెంట్‌తో కలసి సందర్శించి జ్వరాలతో చేరిన వారిలో మలేరియా లక్షణాలతో ఉన్నవారి ఆరోగ్య స్థితిని వారికి అందజేస్తున్న చికిత్సను కేస్ షీట్‌లో పరిశీలించి అక్కడి వైద్యులతో మాట్లాడారు. రోగులతో మాట్లాడి ఏ ప్రాంతం నుంచి ఎక్కువగా జ్వరాలు వస్తున్నాయో తెలుసుకొని సంబంధిత వైద్యాధికారులకు, క్షేత్రస్థాయి సిబ్బందికి తగు నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం కుసిమి పిహెచ్‌సిని సందర్శించి ల్యాబ్ రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి భాను ప్రతాప్ ఎఎమ్ఒ సూర్యనారాయణ, కన్సల్టెంట్ శ్రీకాంత్, సబ్ యూనిట్ అధికారి మోహన రావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.


వైద్యులతో మాట్లాడుతున్న జగన్‌మోహనరావు

ప్రమాదకరంగా డివైడర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన డివైడర్ ప్రమాదకరంగా మారింది. ప్రధాన రహదారికి మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్‌కు అక్కడక్కడ విద్యుత్ స్తంభాలతో విద్యుత్తు లైట్లు కూడా ఏర్పాటు చేయవలసి ఉంది. అధికారుల నిర్లక్ష్యం వల్ల మార్గం మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్‌కు ఎటువంటి ఆనవాళ్లు లేకపోవడంతో ప్రమాదాలకు దారి తీసే విధంగా కనిపిస్తున్నాయి. మండల కేంద్రంలోని మిత్ర జంక్షన్, తెలగ వీధి, అంబేద్కర్ కూడలి, జన వీధి, పెట్రోల్ బంకు వద్ద రహదారి వెడల్పుగా ఉండటం వల్ల రాత్రి సమయంలో డివైడర్లు కనిపించట్లేదు. ఈ నెల 29వ తేదీన పాలకొండ నుండి వీరఘట్టం వైపు వస్తున్న కారు పెట్రోల్ బంకు దగ్గరకు వచ్చేసరికి డివైడర్ కనిపించకపోవడంతో కారు డివైడర్‌కి ఢీ కొట్టింది. దీంతో అందులో ప్రయాణించే ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. మరోసారి ఇటువంటివి పునరావృతం కాకుండా ఉండేందుకు రోడ్లు, భవనాల శాఖ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న డివైడర్

కథలు జ్ఞాపక శక్తిని పెంచుతాయి

ప్రజాశక్తి-పాలకొండ

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిబిరంలో భాగంగా గురువారం తెలుగు ఉపాధ్యాయులు కె.జనార్ధనరావు విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించడానికి వారి జీవితంలో నీతిని పెంచి వారి జీవన రీతి పెంపొందించితే వారి ఖ్యాతి పెరుగుతుందని అందుకే కథలంటే ప్రీతి వుండాలని విద్యార్థులచే కథలు చెప్పించారు. కథల వల్ల జ్ఞాపకశక్తి, వినికిడి శక్తి, తెలివి, సామర్థ్యం, భాషా జ్ఞానం, విచక్షణా జ్ఞానం, వివేకం, ఏకాగ్రత పెరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఇంఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, సహాయకుడు ఈశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో పుస్తక పఠనం, క్విజ్ నిర్వహించారు. అలాగే క్విజ్ పోటీలతో పాటు ప్రముఖుల జీవిత చరిత్రను విద్యార్థులకు చదివి వినిపించారు. ఆటల పోటీలు తదితర కార్యక్రమాలను ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు శాఖా గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదనరావు తెలిపారు. వేసవి శిక్షణలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: గ్రంథాలయ శాఖ వేసవి శిబిరాల్లో భాగంగా గుమ్మలక్ష్మీపురం గ్రంథాలయంలో విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన, స్వామి వివేకానంద జీవిత చరిత్ర గురించి వివరించినట్లు లైబ్రేరియన్ డి. సుకన్య తెలిపారు. వీటితో పాటు విద్యార్థులకు ఆటలు, పాటల పోటీ కూడా నిర్వహించామన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

విద్యతోనే సమాజాభివృద్ధి

ప్రజాశక్తి-బొబ్బిలి

విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని ఆంధ్రా యూనివర్సిటీ రిటైర్డ్ ఫిజిక్స్ హెడ్ ఆఫ్ డిపార్ట్మెంట్ డాక్టర్ కె.చంద్రమౌళి అన్నారు. పట్టణంలోని శ్రీనిధి పాఠశాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందిస్తేనే సమాజానికి ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉందన్నారు. పట్టుదల, క్రమశిక్షణతో చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని విద్యార్థులకు సూచించారు. పిల్లలను చదివించేందుకు తల్లిదండ్రులు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో వాసు విద్యాసంస్థల వ్యవస్థాపకులు రౌతు రామ్మూర్తి, కరస్పాండెంట్ వాసుదేవరావు, మేనేజింగ్ పార్ట్నర్ దాశరథి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని రకాల పంటలనూ సాగు చేయాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

ప్రస్తుత ఆధునిక యుగంలో రైతులు మనిషికి సంబంధించి ప్రతి రోజు నిత్యవసరమైన ప్రతి పంటను అన్ని ప్రాంతాల్లో విరివిగా పండించాలని అప్పుడే అధిక ఆదాయాన్ని పొందుతారని సమీకృత వ్యవసాయ శాస్త్రవేత్త బి.రాజేంద్రకుమార్ తెలిపారు. మండలంలోని తడాంగి వలసలో గిరిజనులకు సమీకృత వ్యవసాయ విధానం ద్వారా వేరు శెనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎన్నో దశాబ్దాలుగా పండిస్తున్న పంటలు అంతరించిపోకుండా చూసే బాధ్యత ప్రతి రైతుపై ఉందని, అందుకు గిరిజన రైతులంతా ముందుకొచ్చి రాగులు, సామలు, కొర్రలు, అండు కొర్రలు, నువ్వులు, వేరు శెనగ మొదలగు పంటలను పండించేలా ఉండాలని రైతులకు సూచించారు. అనంతరం మెట్టవలసలో వేసవిలో వేసిన కట్టె జనుము, పిల్లి పెసర పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ నాగేశ్వరరావు, ధరణి ఎఫ్‌పిఒ ఈశ్వర రావు, కామేశ్వర రావు పాల్గొన్నారు.


విత్తనాలను పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్త

నడుకూరులో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడుకూరులో గురువారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి ప్రదీప్ వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం ఎం.సరస్వతి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

6న మెగా నేత్ర వైద్య శిబిరం

వీరఘట్టం: మండలంలోని చిట్టపూడివలస జంక్షన్ వద్ద గల శ్రీ సత్య సాయి నిత్య అన్నపూర్ణ సేవా సంస్థ ఆధ్వర్యంలో జూన్ 6న విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి వారిచే మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీర్ఘకాలికంగా కంటిచూపుతో బాధపడుతున్న వారితో పాటు కంటిలో చిన్న చిన్న సమస్యలు ఉన్నవారు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. నేత్ర శిబరానికి వచ్చిన వారు ఆరోగ్యశ్రీ కార్డు, ఆధారు, బ్యాంకు ఖాతా, ఇతర గుర్తింపు కార్డులతో తప్పనిసరిగా హాజరుకావాలని వారు కోరారు.

రమణమూర్తి మృతికి పలువురి సంతాపం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

సీనియర్ న్యాయవాది వైవి రమణమూర్తి మృతికి ఎస్.కోట జూనియర్ సివిల్ జడ్జి సబ్బవరపు వాణి, న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శి జి.సూరిదేముడు, బి.సత్యనారాయణ, న్యాయవాదులు కోర్టు హాల్లో గురువారం రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా జి.సూరిదేముడు మాట్లాడుతూ అందరితో కలిసి మెలిసి ఉండే న్యాయవాది రమణమూర్తి కొద్ది నెలలుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మృతి చెందారన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిపి పి.కేశవరావు, న్యాయవాదులు బి.త్రిమూర్తులు, కెవిఎస్ రామరాజు, డబ్ల్యుఎన్ శర్మ, వారాది ఈశ్వరరావు, టివిఆర్ మూర్తి, పి.నాగేశ్వరరావు, బివిఎస్ రామారావు, జి.చిట్టిబాబు, బి.వెంకటరావు, సిహెచ్ఆర్ఎ నాయుడు, గేదెల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు శిక్షణ

ప్రజాశక్తి-తెర్లాం

తెర్లాంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణ ఇచ్చారు. ఎంఇఒ-2 ఆర్.పాపారావు అధ్యక్షతన నిర్వహించిన శిక్షణలో మెనూ ప్రకారం ఎలా వంటలు చేయాలో వీడియోల ద్వారా వివరించారు. వివిధ రకాల వంటకాలను స్టాల్స్ రూపంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగుల గుర్తింపు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో వికలాంగ చిన్నారులను గుర్తించి బడిలో చేర్పించేందుకు భవిత కేంద్రం ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో సర్వే చేపట్టారు. ఎంఇఒలు జి.జగదీశ్వరరావు, పి.బాల బాస్కరరావు పర్యవేక్షణలో చదువుకు దూరంగా ఉన్న ప్రత్యేక అవసరాల పిల్లల వివరాలను సేకరిస్తున్నారు. ఇప్పటివరకు 16 మందిని గుర్తించారు. జూన్ 9వ తేది వరకు సర్వే కొనసాగుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్.సత్యవతి, సిహెచ్ జయంత్, తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకుల నివారణకు సహకరించాలి : కమిషనర్

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో పైపులైన్ లీకులను నివారించేందుకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి.. సిబ్బందిని కోరారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఇంజినీరింగ్, సచివాలయ ఎమినిటీ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ వార్డుల్లో తాగునీరు సరఫరా చేసే సమయంలో ఎమినిటీ సెక్రటరీలు పర్యటించి లీకులను గుర్తించి, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. మున్సిపాలిటీలో పూర్తి స్థాయిలో పైపులైన్ లీకులను నివారించాలని కోరారు. ప్రజలకు సంపూర్ణంగా తాగునీరు సరఫరా చేసేందుకు సహకరించాలని, తాగునీటిని వృథా చేయొద్దని కోరారు.